

ఊరికి పోదాం.. చలోచలో..

నిత్యం వాహనదారులతో కిటకిటలాడే ఉప్పల్‌-వరంగల్‌ జాతీయ రహదారి శనివారం మరింత రద్దీగా మారింది. సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఉప్పల్‌ బస్టాప్‌కు వేల సంఖ్యలో ప్రయాణికులు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సొంత వాహనాల్లో వేల సంఖ్యలో ప్రయాణించగా.. శనివారం ఒక్కరోజే ప్రయాణికుల కోసం దాదాపు 400 ఆర్టీసీ బస్సులను ఉమ్మడి వరంగల్‌ జిల్లాకు నడిపినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం దాదాపు 40 వేల మంది ప్రయాణం చేసినట్లు వారు తెలిపారు. – ఉప్పల్‌



- అవిశ్వాసం లేకుండా ఉండేలా విదేశాలకు ప్లాన్‌
- మేడ్చల్‌ మున్సిపల్‌ అధికారం చేజారకుండా..
- కౌన్సిలర్లను మచ్చిక చేసుకుంటున్న నేతలు
- ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు
- చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



అసమ్మతి కూల్‌..

మేడ్చల్‌: రెండు నెలల్లో మారిన రాజకీయంతో తమ నేతలు జారకుండా ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ నేతలు మేడ్చల్‌లో జాగ్రత్త పడుతున్నారు. మొదటి నుంచీ అసమ్మతి రాగంతో పార్టీకి తలనొప్పిగా మారిన మేడ్చల్‌ మున్సిపాలిటీ రాజకీయాన్ని గాడిన పెట్టేందుకు ఎమ్మెల్యే మల్లారెడ్డి తన రాజకీయ అస్త్రాలను ప్రయోగిస్తూ తమ పార్టీ కౌన్సిలర్లు జారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మొదటి నుంచీ అసమ్మతి..

మేడ్చల్‌ మున్సిపాలిటీలో 23మంది కౌన్సిలర్లు ఉండగా బీజేపీ నుంచి ఒక్కరు, కాంగ్రెస్‌ నుంచి నలుగురు, బీఆర్‌ఎస్‌ రెబల్స్‌గా నలుగురు, 14మంది బీఆర్‌ఎస్‌ నుంచి గెలిచారు. కాంగ్రెస్‌ నుంచి గెలిచిన కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరగా, నలుగురు రెబల్స్‌ బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్‌ బలం 19కి చేరింది. సంఖ్యాపరంగా ఎలాంటి డోకా లేకుండా ఉన్న కౌన్సిలర్లు అసమ్మతి రాగం ఆలపించడంతో సంవత్సర కాలం నుంచి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌లో సంక్షోభం ఏర్పడింది. వైస్‌ చైర్మన్‌తో పాటు మరో 14మంది కౌన్సిలర్లు చైర్మన్‌ను కుర్చీ నుంచి దించాలని, నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాలని శతవిధాలా ప్రయత్నం చేసి ఆరు నెలల క్రితం అవిశ్వాసం పెట్టాలని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, నాడు మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి అవిశ్వాసం లేకుండా జాగ్రత్త పడటంతో అవిశ్వాసం తేదీ ఖరారు కాలేదు. బీఆర్‌ఎస్‌లో అసమ్మతి కౌన్సిలర్లు చైర్మన్‌ తీరును బహిరంగంగానే విమర్శిస్తూ మున్సిపల్‌ కార్యాలయంలో, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ధర్నాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలతో అవిశ్వాసం అటకెక్కింది.

ప్రయత్నాలు జరిగినా..

మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌కు గండి కొట్టాలని కాంగ్రెస్‌ నాయకులు ప్రయత్నం చేసినా అవి సఫలం కాలేదు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ అసమ్మతి కౌన్సిలర్లకు ఆ పార్టీ నాయకులు గాలం వేసినా బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్ల డిమాండ్‌లకు ఓకే చెప్పకపోవడంతో వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. ఎన్నికలలో మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌ గెలిచినా రాష్ట్రంలో కాంగ్రెస్‌ గెలవడం, రాష్ట్రంలోని చాలా జిల్లాలో మున్సిపాలిటీల్లో అవిశ్వాసల జోరు కొనసాగుతుండటంతో మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

విదేశాల బాటలో బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు..

మరో సంవత్సర కాలం పాటు మున్సిపల్‌ కౌన్సిల్‌కు పదవి కాలం ఉండటంతో అధికారం చేజారకుండా నాయకులు జాగ్రత్త పడుతున్నారు. ఓవైపు రాష్ట్రంలో అధికారం లేకపోవడం, మరోవైపు అసమ్మతితో తామే నష్టపోతామనే భావనతో అసమ్మతి నాయకులు వెనుకడుగు వేశారు. మంత్రి మల్లారెడ్డి తన వద్ద ఉన్న అన్ని అస్త్రాలను వాడుతూ కౌన్సిలర్లను కాపాడుకునే యత్నాలు చేస్తున్నారు. గతంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రయోగించిన అస్త్రం విదేశీ టూర్‌ అస్త్రాన్ని మేడ్చల్‌లో ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లను విదేశీ టూర్‌ తీసుకెళ్లడానికి అన్నీ సిద్ధం చేశారు. ఈ మేరకు కౌన్సిలర్లు పాస్‌పోర్టులు, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకుంటున్నారు. పాస్‌పోర్టుల ప్రక్రియను కౌన్సిలర్లు పూర్తి చేసుకున్నారు. రూపాయి ఖర్చు లేకుండా బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లందరినీ విదేశీ టూర్‌కు తీసుకెళ్లాలని ఆదేశాలు జారీ కావడంతో నాయకులు ఆ ఏర్పాట్లలో ఉన్నారు. తమలో ఉన్న మనస్పర్థలు పక్కన పెట్టి అసమ్మతి కౌన్సిలర్లు, మిగతా కౌన్సిలర్లు విదేశీ యాత్రకు వెళ్లడానికి చకచకా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అదను కోసం కాంగ్రెస్‌ చూపు..

కొంతమంది బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకుని మేడ్చల్‌ మున్సిపల్‌ పీఠం చేజిక్కించుకోవాలని కాంగ్రెస్‌ నాయకులు అదునుకోసం చూస్తున్నారు. మేడ్చల్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌ తమ డిమాండ్లు ఒప్పుకుంటే తాను అసమ్మతి గ్రూపును లీడ్‌ చేస్తానని, తనకు రాబోయే టర్మ్‌లో చైర్మన్‌ పదవి ఇవ్వాలని కండిషన్లు పెడుతున్నారని సమాచారం. కాంగ్రెస్‌ పార్టీలో ముందుగానే హామీ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ పార్టీ నాయకులు సందిగ్ధంలో పడ్డారు. మొత్తం మీద మేడ్చల్‌ బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్ల అసమ్మతి నివురుగప్పిన నిప్పులా మారింది. నిప్పు మీద ఎమ్మెల్యే మల్లారెడ్డి నీళ్లు చల్లుతున్నా నేతల ఆశలు, పదవీ కాంక్షలతో ఆ అసమ్మతి తిరిగి ఎప్పుడు రాజుకుంటుందో వేచిచూడాల్సిందే..

గడప గడపకూ అక్షతలు



అయోధ్య అక్షతలను అందజేస్తున్న నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌

మల్లాపూర్‌: అయోధ్య శ్రీరామ పూజిత అక్షతలను గడపగడపకూ పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాచారం కార్తికేయనగర్‌లోని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌ శేఖర్‌కు ఇంట్లో అందజేశారు. అక్షతలతో పాటు రామమందిరం ఫొటో, కరపత్రం అందజేశారు. కార్యక్రమంలో కట్ట బుచ్చన్నగౌడ్‌, నవీన్‌, నాగరాజు, దాసరి కర్ణ, గోపి, భాస్కర్‌ తదితరులు ఉన్నారు.

మర్రి చెన్నారెడ్డికి నివాళి



మల్కాజిగిరి: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్‌ అన్నారు. ఇందిరా పార్కు వద్ద శనివారం నిర్వహించిన మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్‌ హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు.

సంజీవ్‌రెడ్డికి మాతృవియోగం



సంజీవ్‌రెడ్డిని పరామర్శిస్తున్న చామకూర మల్లారెడ్డి

బోడుప్పల్‌: ఘట్‌కేసర్‌ మాజీ జెడ్పీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్‌ బోడుప్పల్‌ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి తల్లి వెంకటమ్మ శుక్రవారం రాత్రి పరమపదించారు. మాజీ మంత్రి, మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, జడిగె మహేందర్‌ యాదవ్‌, చీరాల నర్సింహ వెంకటమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె అంతిమ యాత్రలో వారు పాల్గొన్నారు.

ఆరెకటికల సమస్యలను పరిష్కరిస్తా



కేలండర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, సంఘం నాయకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఆరెకటిక సామాజిక వర్గం ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆరెకటిక సూర్యవంశం మల్కాజిగిరి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గౌలికర్‌ రవీందర్‌, శైలేందర్‌ మాట్లాడుతూ దేశంలోని సుమారు 16 రాష్ట్రాల్లో ఆరెకటిక సామాజిక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చారని, తెలంగాణలో చేర్చడానికి అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌, దినేష్‌, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



బోడుప్పల్‌: బోడుప్పల్‌ మున్సిపల్‌ నగర పాలక సంస్థ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు రాసాల కుమార్‌యాదవ్‌ తండ్రి మల్లేష్‌ యాదవ్‌ దశదిన కర్మలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్‌, రాసాల వెంకటేశ్‌యాదవ్‌ నేతలు కొత్త గోపాల్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్‌ యూత్‌ డే వేడుకలు



మల్కాజిగిరి: వీర్‌ భారతి సేనా ఆధ్వర్యంలో మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్‌ హాల్‌లో నేషనల్‌ యూత్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సేన మల్కాజిగిరి అధ్యక్షుడు ఉడుత నవీన్‌కుమార్‌ మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయవాదం, కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ పెంచుకోవడం కోసం పోటీలు నిర్వహించామన్నారు. కార్పొరేటర్లు శ్రవణ్‌, రాజ్యలక్ష్మి, సూర్యప్రకాష్‌, రవీంద్రనాథ్‌, సునీత రామ్మోహన్‌, బాలచందర్‌, వీకే మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు

కాప్రా: గాంధీనగర్‌, ఆదిత్యనగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదిత్యనగర్‌ పార్క్‌లో అశోకా మల్టీస్పెషాలిటీ రిహబిలిటేషన్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాంధీనగర్‌లో కాలనీ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌ రెడ్డి, కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌, అశోక మల్టీస్పెషాలిటీ రిహబిలిటేషన్‌ సెంటర్‌ డైరెక్టర్‌ రాహుల్‌, కిరణ్‌కుమార్‌, సచిన్‌, నవిత, గాంధీనగర్‌ యూత్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్‌ ట్రస్ట్‌ నుంచి విద్యా వలంటీర్లకు జీతాలు



విద్యా వలంటీర్లకు జీతాలు అందజేస్తున్న ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో బీఎల్‌ఆర్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యావలంటీర్లకు శనివారం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీతాలు అందజేశారు. పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తన ట్రస్టు ద్వారా సునీత, మంజుల ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేసి జీతాలు చెల్లిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల కోసం వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు బీఎల్‌ఆర్‌ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, స్థానిక నేతలు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్‌, ఎంకిర్యాల నర్సింహ, రాజుగౌడ్‌, మల్లేశ్‌ వంశరాజ్‌ పాల్గొన్నారు.

శ్రీవారికి చందన సేవ

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని స్వామికి చందన సేవను ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు నిర్వహించారు. భోగి పర్వదినం సందర్భంగా గోదాదేవి కల్యాణం ఉదయం 10 గంటలకు జరుగుతుందని, ధనుర్మాస పూజలు ముగుస్తాయని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మారుతీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు వెన్నతో అలంకరించి అర్చకులు శ్యామ్‌ ప్రసాద్‌ శర్మ పూజలు నిర్వహించారు.



చందనసేవలో వేంకటేశ్వరస్వామి



వెన్న అలంకారంలో ఆంజనేయస్వామి

స్వచ్ఛతలో ఎన్‌ఎఫ్‌సీకి మూడోస్థానం

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్‌ ఫ్యూయల్‌ కాంప్లెక్స్‌(ఎన్‌ఎఫ్‌సీ) మూడోస్థానం సాధించింది. ఈ మేరకు అణుఇంధన సంస్థ నుంచి సర్టిఫికెట్‌ అందుకున్నట్లు ఎన్‌ఎఫ్‌సీ సంస్థ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపాయి. దేశవ్యాప్తంగా ఉన్న అణుఇంధన సంస్థల్లో గత సెప్టెంబరు 15 నుంచి అక్టోబర్‌–2 వరకు చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించిన అణుఇంధన సంస్థ ఈ ఎంపిక చేపట్టినట్లు పేర్కొన్నారు. మొదటి స్థానంలో చెన్నైలోని ఐజీసీఏఆర్‌, రెండోస్థానంలో కలకత్తాలోని వీఈసీసీ నిలిచినట్లు వెల్లడించారు.

శ్రీరామ స్పర్శ అక్షింతల పంపిణీ



కుషాయిగూడ: శ్రీరామ జన్మభూమి తీర్థ్‌ క్షేత్ర ట్రస్టు కుషాయిగూడ శాఖ ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ స్పర్శ అంక్షితలను పంపిణీ చేశారు. చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్‌ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డికి అక్షింతలతో పాటు అయోధ్య రామమందిర చిత్రాన్ని అందజేశారు. కుషాయిగూడ నగర సంయోజక్‌, సాహసంయోజక్‌ అంజిరెడ్డి, చల్లా ప్రభాకర్‌, బజరంగ్‌దళ్‌ నాయకులు బాలకృష్ణ, విజయ్‌, రాకేశ్‌, వీరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ శిల్పారామానికి సంక్రాంతి శోభ

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా శనివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. హరిదాసులు, బోగివళ్లు, గంగి రెద్దుల విన్యాసాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆంపీ థియేటర్‌ వద్ద చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఎస్‌ఎఫ్‌ఏ మంజులకు సన్మానం



కాప్రా: ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న కాప్రా సర్కిల్‌కు చెందిన ఎస్‌ఎఫ్‌ఏ మంజులకు శనివారం ఏఎస్‌రావునగర్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గార్బేజ్‌ ఫ్రీ సిటీలో భాగంగా ఫైవ్‌స్టార్‌ రేటింగ్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌ ఆల్‌ ఇండియా క్లీన్‌ సిటీలో 9వ ర్యాంకు సాధించిన హైదరాబాద్‌ తరఫున మంజుల అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంజులను సహ ఉద్యోగులు, మున్సిపల్‌ సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందించారు.

పీహెచ్‌సీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



అల్వాల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: అల్వాల్‌లో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్‌ రఘునాథస్వామి, కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్వాల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనుల్లో అలసత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చూడాలని వైద్య విభాగం అధికారులకు ఆయన సూచించారు. అదేవిధంగా ఇక్కడ నిర్మించాల్సిన తెలంగాణ డయాగ్నోస్టిక్‌ సెంటర్‌, ఆరోగ్య కేంద్రం కంపౌండ్‌ వాల్‌, పలు అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్‌ ప్రసన్నకుమారి, సీహెచ్‌వో రాము, వైద్యాధికారులు వీరయ్య, జంగయ్య, అరుణ, మరియా, కాంట్రాక్టర్‌ శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్‌ నాయకులు డోలి రమేష్‌, మల్లేష్‌గౌడ్‌, పరమేష్‌, లడ్డు, శ్రీనివాస్‌, సాయిరాంగౌడ్‌, సత్యనారాయణ, సంజీవరెడ్డి, రాజేందర్‌, కన్నాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



అండగా ఉంటా..



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న బాధితులు

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ జయగిరి లక్ష్మీనర్సింహస్వామినగర్‌లో నివాసితులకు అండగా ఉంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆలయ భూముల్లో నివాసం ఉంటున్న నివాసితులకు ఎండోమెంట్‌ అధికారులు ఈవో రమాదేవి నేతృత్వంలో 11 ఇళ్లను సీజ్‌ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఇళ్ల సీజ్‌ను ఆపి హైకోర్టు లాయర్‌తో మాట్లాడి కోర్టు స్టే తీసుకువచ్చారు. శనివారం కార్పొరేటర్‌ మేకల సునీతరాముయాదవ్‌ ఆధ్వర్యంలో బాధితులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్‌ నాయకులు రాముయాదవ్‌, సిద్ది రాములు, కృష్ణగౌడ్‌, నందు, గౌతమ్‌, సత్యనారాయణ, కృష్ణ, షేక్‌ అహ్మద్‌, కుసుమ, రేణు, ఇళ్ల నివాస బాధితులు, స్థానికులు ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు మైనార్టీ రెసిడెన్షియల్‌ విద్యార్థులు



జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన మైనార్టీ బాలికల రెసిడెన్షియల్‌ స్కూల్‌ విద్యార్థులు

కుషాయిగూడ: అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలకు కుషాయిగూడలోని కుత్బుల్లాపూర్‌ బాలికల మైనార్టీ రెసిడెన్షియల్‌ స్కూల్‌ విద్యార్థులు ఎంపికయ్యారు. గతేడాది ఆగస్టు నెలలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ రంగోత్సవ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రెండు, మూడు, నాల్గో స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు 45 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, నాలుగు మెరిట్‌ అవార్డులతో పాటు నాలుగు కన్సోలేషన్‌ బహుమతులను అందుకున్నట్లు ఆర్ట్‌ టీచర్‌ శ్రీగౌరి తెలిపారు. జాతీయస్థాయిలో పాల్గొన్న 300 మంది 9 కేటగిరిల్లో 66 మంది వివిధ స్థాయిలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 9న నగరంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు అత్యంత ప్రతిభ కనబర్చిన ఐదురుగు విద్యార్థులను పంపనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

అల్వాల్‌: ఇంట్లో ఉరి వేసుకొని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సురేష్‌ తెలిపిన వివరాల ప్రకారం ఆదర్శనగర్‌లో నివాసముండే వరలక్ష్మి శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం గమనించిన కుమారులు అల్వాల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వరలక్ష్మి మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతోందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అల్వాల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూటన్‌ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



బోడుప్పల్‌: ఇందిరానగర్‌ కాలనీలోని న్యూటన్‌ గ్రామర్‌ హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబురాలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లి, పతంగుల తయారీ, భూమి కళ నైపుణ్యం, గ్రీటింగ్‌ కార్డుల తయారీ పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యూటన్‌ గ్రామర్‌ హైస్కూల్‌ కరస్పాండెంట్‌ కె.రాంచంద్రారెడ్డి, ముఖ్య సలహాదారి కేఎన్‌ రేమాదేవి, ప్రిన్సిపాల్‌ వై.కృష్ణ, ఇన్‌చార్జులు జితేందర్‌రెడ్డి, మిస్స రాణి, లూసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో..



బోడుప్పల్‌: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేడుకల్లో పాల్గొని బోగి మంటలు వేశారు. రంగోళి, గాలి పటాలు ఎగుర వేయడం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌ అయ్యంగార్‌, ప్రిన్సిపాల్‌ నీలిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగోలీ పోటీలు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని వివిధ ప్రాంతాల్లో రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఓల్డ్‌ మల్కాజిగిరిలో జీడీ సంపత్‌గౌడ్‌ ఆధ్వర్యంలో, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌లో బీజేపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, బాలచందర్‌, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657